# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 312: నేటి సమాజంలో ప్రవృత్తులు
# మార్చ్ 23, 2024

ఈ ప్రశ్న -సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 1, పేజీలు 60-65 నుండి తీసికొనబడినవి

స్వామి! మన భారత దేశం మతాతీత రాజ్యాంగానికి ప్రసిద్ధి చెందినది. కానీ రాజకీయాలలో మతాతీత భావనను వివిధ రకాల అర్థాలతో, అపార్థాలతో వికృతీకరిస్తున్నారు. ఇది మాకు అర్థమయ్యేలా స్పష్టపరచమని ప్రార్థిస్తున్నాము.

భగవాన్: మతాతీతం అంటే నాస్తికత్వం కాదు. మతాతీత దేశమంటే హిరణ్యకశిపుని దేశం కాదు. దేశానికి చెందిన ప్రతి పౌరుడు తన ధర్మమును అనుసరించి, ప్రకటించగలిగి, ఇతరుల మతాలను, ధర్మాలను కించపరచకుండా ఉండాలి. సనాతన ధర్మం మతాతీతమైనది. కృష్ణుడు చెప్పినట్లు,

స్వధర్మే నిధానం సశ్రేయః
పరధర్మో భయావహః

అంటే నీవు స్వధర్మమును అనుసరించాలి, పరధర్మమును కాదు. కానీ ఇక్కడ ఒక ముఖ్యమైనది తెలుసుకోవాలి. స్వధర్మం అంటే మన కులము, ఆశ్రమం, ఉద్యోగానికి సంబంధించింది కాదు. స్వధర్మం అంటే ఆత్మధర్మం, ఆత్మ చైతన్యంపై ఆధారపడియున్నది. అరధర్మం అంటే అనాత్మధర్మం, అనాత్మ చైతన్యం, అంటే దేహాభిమానంపై ఆధారపడియున్నది.

స్వామి! నేడు ఎన్నో అంతర్జాతీయ సంస్థలు శాంతి కొరకు పోరాడుతున్నారు కానీ ఆ సంస్థల యొక్క మార్గదర్శక సూత్రాలు సరి అయిన మార్గంలో లేవు. అటువంటప్పుడు శాంతి ఎలా లభిస్తుంది?

భగవాన్: వారి విధానమే తప్పు. శాంతి అంటే ఎక్కడుంటుంది? శాంతి నీలోనే ఉంటుంది. నీవే శాంతస్వరూపుడవు. శాంతి బయటి ప్రపంచంలో దొరకదు. బయట దొరికేది peace కాదు, pieces. మొట్టమొదట వ్యక్తిగతంగా శాంతి సాధించు, తర్వాత నీ కుటుంబానికి పంచిపెట్టు. క్రమంగా సంఘానికి, ఆ తర్వాత దేశానికి విస్తరిస్తుంది. ఎన్నో దేశాలు అణుబాంబుల వంటి సామూహిక వినాశనపు ఆయుధాలు పేర్చుకొని శాంతి మంత్రాలు చదువుతుంటారు. ఇదా శాంతి?

స్వామి! ఈ ఆధునిక యుగంలో యజ్ఞాలు, యాగాలు వంటి పురాతన ఆచారాలను అర్థం లేని ఆచారాలని, హాస్యాస్పదమైనవని, కాలం చెల్లినవని తీసిపడేస్తున్నారు. ఇలా ఎందుకు జరుగుతోంది స్వామి?

భగవాన్: దీనికి అజ్ఞానం మూల కారణం. అజ్ఞానంతో కూడిన అధికప్రసంగాలు. ఒక చిన్న ఉదాహరణ: ఒక డిస్ట్రిక్ట్ కలెక్టరు ఉద్యోగపు పని మీద ఒక గ్రామానికి వెళ్ళాడు. అక్కడ ఒక రైతు తన వరి చేనులో వడ్ల గింజలు విసరడం చూసాడు. ఇందువలనే మన భారత దేశం ఇంత బీదగా ఉంది అనుకున్నాడు ఆ కలెక్టరు. "జనాలందరూ ఆకలితో అలమటిస్తుంటే ఈ పల్లెటూరి వాడు వడ్ల గింజలను ఊరికే పారేస్తున్నాడు"

అనుకున్నాడు. ఎందుకు అలా చేస్తున్నాడని ఆ రైతును అడిగాడు. ఆ రైతు చెప్పాడు, "అయ్యా, నేను వీటిని వృధాగా పారెయ్యడంలేదు. ఈ రోజు ఒక బస్తా గింజలు ఊరికే గాలిలోకి విసిరేసినట్లు ఉండొచ్చు, కానీ తర్వాత ఈ ఒక్క బస్తా గింజలతో యాభై బస్తాల బియ్యం వస్తుంది." అప్పుడు ఆ కలెక్టరుకు తన తప్పు అర్థమైంది.

అదే విధంగా యజ్ఞాలు, యాగాలు జరుగుతున్నప్పుడు చూస్తే నెయ్యి వంటి ఎన్నో పదార్థాలు అనవసరంగా యజ్ఞ గుండంలో పోస్తున్నట్లు అనిపించవచ్చు. అది తప్పు. వేద మంత్రాలను చదువుతూ యజ్ఞ గుండంలో పోసే పదార్థాలు అగ్నిలో భస్మమై వచ్చే పొగ కలుషితమైన గాలి, వాతావరణాన్ని శుద్ధి చేసి, పవిత్రం చేస్తుంది. ఈ ఆచారాలు కాలం చెల్లిపోయినవని, హాస్యాస్పదములైనవని, అర్థంలేనివని అనుకోవడం పొరపాటు. వాటి వల్ల వర్షాలు, పంటలు సమయానికి వస్తాయి. మన వేదాలలో నిర్దేశించిన ఆచారాలన్నీ కూడా సమాజ శ్రేయస్సు కొరకు, మానవుని శాంతిసుఖముల కొరకు ఉద్దేశింపబడినవి.

**స్వామి! శాస్త్రము, రాజకీయము, నీతిశాస్త్రము, మతము, ఆధ్యాత్మికము, ఇటువంటి రంగాలలో అభివృద్ధి చెందడానికి పద్ధతులు చెప్పండి.**

భగవాన్: మీరు మూడు నియమాలను పాటిస్తే అన్ని రంగాలలో అభివృద్ధి చెందవచ్చు, వ్యక్తి గతంగా, సమాజంలో కూడా.

మొట్టమొదటి నియమం దైవప్రీతి. రెండవది పాపభీతి. మూడవది సంఘనీతి. భగవంతుని ఎంతో ప్రేమిస్తే గానీ పాపమంటే భయముండదు. పాపభీతి ఉంటే సంఘనీతి అదే ఏర్పడుతుంది. కనుక ఈ మూడు నియమాలు ఒక దాని మీద ఒకటి ఆధారపడి ఉన్నాయి.

నేను మన విద్యార్థులకు ఎప్పుడూ చెప్తుంటాను, "ఏదైనా పని మొదలు పెట్టక ముందు నిన్ను నీవు ఇది ప్రశ్నించుకో: స్వామి ఈ పనిని ఆమోదిస్తారా? స్వామి సంతోషిస్తారా?" స్వామి పై మీకున్న అత్యున్నత ప్రేమయే మిమ్మలను ఏ తప్పు పనులను చేయనియ్యదు. కనుక, దైవప్రీతి ఉంటే అదే పాపభీతికి దారి తీస్తుంది.

సముద్రంలో తీవ్రమైన, ఉద్రేకమైన అలలు వచ్చి బండరాళ్ళను పదే పదే కొట్టుకుంటుంటాయి. కానీ ఆ రాళ్ళు అక్కడే తొణకకుండా నిబ్బరంగా నిల్చుంటాయి. అదే విధంగా మీకెటువంటి కష్టాలు, నష్టాలు, ఓటములు, అపజయాలు, బాధలు, ప్రయాసలు వచ్చినా మీ నమ్మకం ధృడంగా ఉండాలి. ఎవరైనా మీతో, "దేవుడు లేడు," అంటే మీరేమని జవాబు చెప్తారు? "నీకు దేవుడు లేకపోతే సరే, నాకు దేవుడు లేడని చెప్పే అధికారం నీకు లేదు," అని చెప్పాలి.
దేవుడిని ఎప్పుడూ మారవకూడదు. ఈ పంచాక్షరిని గుర్తు పెట్టుకోండి: 'దే' 'వు' 'డు' 'న్నా' 'డు'. మీకు సంశయం లేకుండా ఈ అష్టాక్షరిని జపించుకోండి: సంశయాత్మా వినశ్యతి. 'సం' 'శ' 'యా' 'త్మా' 'వి' 'న' 'శ్య' 'తి' అంటే సంశయము నాశనం చేస్తుంది. భగవంతుడిని ఎప్పుడూ సందేహించకూడదు. "God is no where" అనే వాక్యం ఎవరైనా అంటే వారి నికృష్టమైన స్థితికి జాలి పడాలి. W అన్న అక్షరాన్ని నాలుగో పదం ముందు నుంచి తీసి మూడో పదం చివరకు చేరిస్తే "God is now here" అవుతుంది.

మానవుడు ఎన్నో దురదృష్టకరమైన పాపములు చేస్తాడు కానీ వాటి ఫలితాలు అనుభవించడానికి సిద్ధంగా ఉండడు. పుణ్యం కావాలని ఆశిస్తాడు కానీ పాపపు పనులు చేయడం మానడు. పోనీ పుణ్యం పొందడానికి మంచి పనులు చేయడు. ఇలా పుణ్యం పొందడానికి ఏమైనా అర్థం పర్థం ఉందా? ఇలాంటి ఆశలు పెట్టుకోవడం

ఎంత అవివేకం? ఒక రకమైన పని చేసి ఇంకొక రకమైన ఫలితం కావాలని ఎలా ఆశించగలడు? Reaction, Reflection, Resound. వీటి నుండి ఎప్పుడూ తప్పించుకోలేరని గుర్తు పెట్టుకోండి. ఈ విషయమును పూర్తిగా గ్రహించుకున్నప్పుడే ఇతరులకు హానికరమైన పనులు, పాపములు చేయడం ఆపుతాడు.

కనుక దైవప్రీతి, పాపభీతి ఉంటే సంఘనీతి ఏర్పడుతుంది.

స్వామి**!** ఎంతో మంది సంస్కారం గురించి మాట్లాడుతుంటారు**.** సంస్కారానికి ఉన్న విలువేంటి**?**

భగవాన్**:** సంస్కారం చాలా ప్రధానమైనది ఎందుకంటే మీ జీవితము యొక్క విలువ దానిపై ఆధారపడి ఉంది. సంస్కారం ఒక జీవనవిధానం. సంస్కారం ఉంటే దైవత్వమును అనుభవించవచ్చు. సంస్కారముంటే అనేకత్వంలో ఏకత్వం అర్ధమౌతుంది. సంస్కారమే లేకుంటే మానవుడు దానవుడు అవుతాడు. సమాజంలో చెడు పేరు తెచ్చుకొని నాశనమైపోతాడు.

సముద్రములో నీరు ఉప్పగా ఉంటుంది. మానవుని జీవితం ఒక పెద్ద సముద్రం వంటిది. భగవంతుని అనుగ్రహం ఆ సముద్రంపై పడే సూర్యరశ్మి వంటిది. ఆ సూర్యరశ్మి వల్ల సముద్రం లోని ఉప్పు నీరు ఆవిరైపోయి, ఆనందం వంటి ఆవిరి ఆకాశంలో మేఘముల వలే రూపొందుతుంది. అప్పుడు ప్రేమ అనే వర్షం భూమి మీద పడుతుంది. సముద్రంలోని నీరు ఉప్పగా ఉన్నా భూమి పై పడే వర్షం నీరు తీయగా ఉంటుంది ఎందుకు? సముద్రపు నీరు సూర్యరశ్మి ద్వారా పరిశుద్ధమైనది. అదే విధంగా మన జీవితం కూడా సంస్కారం ద్వారా పరిశుద్ధమవ్వాలి. అప్పుడే జీవితము యొక్క విలువ పెరుగుతుంది.

ఒక రూపాయ కంటే విలువ తక్కువైన ఇనుప ముక్కను తీసుకొని ఎంతో విలువైన చేతి గడియారం తయారు చేయవచ్చు. ఆ తయారు చేసే విధానం సంస్కారం వంటిది. రాయి రాయిగా ఉన్నంత కాలం దానికి విలువ ఉండదు. కానీ ఒక శిల్పి చేతిలో అదే రాయి కృష్ణుని రూపంగా చెక్కబడితే దానికే పూజ్య గౌరవాలు అందుతాయి. ఎందువలన? సంస్కారం వలన. అందరూ దానిపై తొక్కి నడచినా అదే రాయి శిల్పం రూపంలో ఉంటే గుడిలో పెట్టి పూజిస్తారు. ఇదే సంస్కారనికిచ్చే విలువ.

సంస్కారం అనేది లేకపోతే జీవితమును వికృత దృష్టితో చూసే వారికి ఏకత్వంలో భిన్నత్వం కనపడుతుంది. ఉదాహరణకు ఒక సూదిని తీసుకోండి. రకరకాల వస్త్రాల ముక్కలను సూదితో కలిపి కుడితే అవి ధరించడానికి దుస్తులౌతాయి. సూది సంస్కరించునది. కత్తెర వస్త్రాన్ని ముక్కలగా కత్తిరిస్తుంది. అంటే సంస్కారాన్ని నాశనం చేస్తుంది.

ధన్యవాదములు! వచ్చే వారంలో మరిన్ని దివ్యమైన సందేశాలు!

ఓం సాయి రామ్**!**